నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 10 జూన్ 2025 | MEDAK

హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో సోమవారం కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరై వస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో హరీశ్‌రావుకు మద్దతుగా తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు

కాళేశ్వరంపై కాంగ్రెస్ కక్షసాధింపు

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ కో ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి

హైదరాబాద్‌లో హరీశ్‌రావుకు మద్దతుగా నిరసన తెలుపుతున్న ఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, నాయకులు

పటాన్‌చెరు, జూన్ 9: కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసమే కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నదని, బీఆర్ఎస్‌ను బద్నాం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నదని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్‌పై కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ఏర్పాటు చేసిందని ఆయన ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు మాజీమంత్రి హరీశ్‌రావు హాజరుకాగా, ఆయనకు మద్దతుగా పటాన్‌చెరు బీఆర్ఎస్ నాయకులు వెళ్లారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రిమండలి ఆమోదంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారని ఆదర్శ్‌రెడ్డి వివరించారు. నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రాజెక్టుపై అనవసర రాద్ధాంతం చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు కక్షసాధింపులను ధైర్యంగా ఎదుర్కొంటామని, బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తులో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేస్తుందని ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య, నాయకులు జగన్నాథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన నాయకులు...

పటాన్‌చెరు, జూన్ 9: కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదుట హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా పటాన్ చెరుకు చెందిన బీఆర్ఎస్ నేతలు భారీగా తరలి వెళ్లారు. సోమవారం హైదరాబాద్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ చేపట్టిన బీఆర్‌కే భవన్ ఎదుటకు వీరు వెళ్లారు. బీఆర్ఎస్ పటాన్ చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి , జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి,రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, యూత్ నాయకులు పృథ్వీరాజ్, భారతి నగర్ డివిజన్ ప్రెసిడెంట్ బూన్, జగన్నాథ రెడ్డి,వెంకట్ రెడ్డి, నాయకులు వెళ్లారు.

మెట్రోరైలు పొడిగించాలి

సంగారెడ్డి, జూన్ 9: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి వరకు మెట్రోరైలును పొడిగిస్తే అందరికీ అసౌకర్యంగా ఉంటుందని, ముఖ్యంగా ఐఐటీహెచ్ అభివృద్ధికి మేలు జరుగుతుందని కోఆర్డినేషన్ ఆఫ్ డిఫెన్స్ రికనైజ్డ్ అసోసియేషన్(సీడీహెచ్ఏ)జాతీయ ప్రధాన కార్యదర్శి అజయ్ సోమవారం ప్రకటనలో కోరారు. మెట్రో రైలు విస్తరణపై కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ, సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాలు పంపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.19.579 కోట్లతో 86.1 కిలోమీటర్ల మేర మూడు ప్రధాన కారిడార్లుగా మెట్రో విస్తరిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2024లో ఫేజ్-2ఎ ప్రాజెక్టు ఇప్పటికే ఆమోదించబడిందని, దాని డీపీఆర్ కేంద్రానికి సమర్పించిందన్నారు. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13.6 కిలోమీటర్ల కారిడార్(6 స్టేషన్ల)తో ఆమోదించబడడం సంతోషకరమని, పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి(పోతిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్) వరకు విస్తరణలో చేర్చకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఐడీఏ పటాన్‌చెరుకు ఆసియాలో రెండో అతి పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిందని, సంగారెడ్డికి ఐఐటీహెచ్ వంటి ప్రతిష్టాత్మక విద్యసంస్థ, కేంద్ర ప్రభుత్వ సంస్థలు భారత్ డైనమిక్ లిమిటెడ్, ఓడీఎఫ్‌లు ఉన్నాయని, అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి సాధిస్తున్న ప్రాంతాలను ప్రభుత్వాలు గుర్తించి మెట్రో రైలును సంగారెడ్డి వరకు పొడిగించాలని ప్రజల కోరిక అని గుర్తుచేశారు.

వానకాలం వచ్చినా పూర్తికాని కొనుగోళ్లు

- మెదక్ జిల్లాలో 3.18 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- కొన్నది 3.10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
- ఇంకా రైతులకు రూ.47.30 కోట్ల బకాయిలు
- ప్రభుత్వం తీరుపై రైతుల ఆగ్రహం

వానకాలం వచ్చినా మెదక్ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తికాలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 498 సెంటర్ల ద్వారా 3.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇంకా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. మొత్తం రూ.648.90 కోట్లకు రైతులకు ఇప్పటి వరకు రూ.600 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా రూ.47.30 కోట్లు బాకీ పడ్డారు. 14,290 మంది రైతుల నుంచి 59,934 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరించారు. ఇందుకు రూ.29.97 కోట్లు బోనస్ చెల్లించారు.

మెదక్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : ఈ యాసంగి సీజన్‌లో మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణకు 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 418 కేంద్రాల ద్వారా 2,49,213 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని సేకరించగా, 80 కేంద్రాల ద్వారా 59,934 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మొత్తం రూ.717 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, రైతులకు రూ. 600 కోట్లు చెల్లించారు. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున 14,290 మంది రైతులకు రూ.29.97 కోట్ల బోనస్ చెల్లించారు. ఇప్పటి వరకు అన్ని కేంద్రాల్లో సేకరణ ముగియగా, 75,371మంది రైతులు తమ ధాన్యాన్ని విక్రయించారు. ఈ సీజన్‌లో మేలో కురిసిన అకాల వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని మండలాల్లోని సెంటర్ల వద్ద ధాన్యం మొలకలు వచ్చాయి. దీంతో రైతులు చేసేదేమీలేక ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను ఆరబెట్టి తూకం వేశారు. కేంద్రాల వద్ద అధికారులు కనీసం టార్పాలిన్లు అందుబాటులో ఉంచక పోవడం రైతులు తిప్పలు పడ్డారు.

లక్ష్యం చేరని ధాన్యం సేకరణ

చిలిపిచెడ్ చండూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు (ఫైల్)

వానకాలం సీజన్ ప్రారంభం...

ఓ వైపు వర్షాలు కురుస్తున్నాయి. జూన్ నెల ప్రారంభంలోనే రైతులు దుక్కులు దున్నుతుకాలు పోస్తుంటారు. ఈసారి ముందుగానే రుతు పవనాలు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో విత్తనాలను కొనుగోలు చేసి దుక్కులు సిద్ధం చేస్తున్నారు. మెదక్ జిల్లాలోని కొన్ని మండలాల్లో ఇప్పటికే విత్తనాలను విత్తారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం ఏర్పడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. అంతేకాదు రూ.47.30 కోట్ల డబ్బులు రైతులకు చెల్లించాల్సి ఉంటుంది.

వేగంగా ధాన్యం సేకరించాం

మెదక్ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 3.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. అకాల వర్షాల వల్ల ధాన్యం సేకరణలో కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా కొనుగోళ్లు వేగంగా పూర్తిచేస్తున్నాం. ఇప్పటికే రూ. 600 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. మరో రూ.47.30 కోట్లు రావాల్సి ఉంది.

– జగదీశ్వర్, సివిల్ సప్లయ్ డీఎం, మెదక్

ముత్తంగిలో కలుషిత నీరు సరఫరా

పట్టించుకోని తెల్లాపూర్ మున్సిపల్ విభాగం

పటాన్‌చెరు రూరల్, జూన్ 9 : ముత్తంగిలో రెండు రోజులుగా నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతున్నది. ఆదివారం, సోమవారం రెండు రోజులుగా ముత్తంగి గ్రామ పరిధిలోని న్యూటౌన్ కాలనీ, సాయిప్రియ కాలనీల్లో సరఫరా చేసిన తాగునీటిలో మురుగునీరు కలవడంతో ప్రజలు ఆ నీటిని వాడుకోలేదు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో ముత్తంగి గ్రామాన్ని విలీనం చేసిన తర్వాత తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ కరువైంది. నెలల పాటు నీరు రాకపోవడం సాధారణంగా మారింది. వారం క్రితం కురిసిన వర్షాలకు మురుగు కాలువలు పొంగిపొర్లాయి. మిషన్ భగీరథ పైప్‌లున్న చోట గుంతల్లో మురుగు చేరింది. మురుగు తాగునీటిలో కలవడం, వాటినే తెల్లాపూర్ మున్సిపల్ విభాగం, సిబ్బంది ప్రజలకు సరఫరా చేస్తున్నారు. దుర్వాసనతో కూడిన మురుగునీరు వస్తుండటంతో ప్రజలు ఆ నీటిని పట్టుకోలేదు. ఈ విషయంపై తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి తెలిపితే, మున్సిపల్ డీఈ సత్యనారాయణను పంపించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

బీఎల్ వోలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్/మెదక్, జూన్ 9: బీఎల్ వోలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లలో మాట్లాడుతూ.. ఈ నెల 25లోగా గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 1200 మందికి పైగా ఓటర్లు ఉన్న చోట కొత్తగా పోలలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటివరకు 1500 వరకు ఓటర్లు ఉంటే ఒక పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశామని, ప్రస్తుతం 1200లోపు ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్తగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలతో కూడిన ప్రతిపాదనల జాబితాను ఈనెల 20లోగా పంపించాలని కలెక్టర్‌కు సూచించారు. ఎస్ఎస్ఆర్-2026 ప్రక్రియ కోసం చేపట్టాల్సిన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని, ఈ నెల 15వ తేదీలోగా తమకు వివరాలు సమర్పించాలని సీఈవో సూచించారు. సమావేశంలో సంగారెడ్డి నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, మెదక్ నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి పథకాల అమలు

- వీసీలో మంత్రి సీతక్క, సీఎస్ రామకృష్ణారావు

వీసీలో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 9: రాష్ట్రంలో కోటీ మంది మహిళలను కోటీశ్వర్లుగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతున్నదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణా రావుతో కలిసి జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బడిబాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ.. మహిళా సంఘాల ద్వారా పెట్రో ల్ పంపుల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో మహిళా సంఘాలకు పెట్రోల్ పంపు ఏర్పాటు కోసం అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, రైస్ మిల్లులు, ఆర్టీసీకి అద్దె బస్సుల వంటి అనేక కార్యక్రమాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సంఘాల సాధికారత, పెట్రోల్ బంకులు, పవర్ ప్రాజెక్టుల అభివృద్ధికి సన్నాహాలు పూర్తి చేస్తున్నట్టు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో మహిళా పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి సిద్ధమైందని, కోహీర్‌లో మరో బంకు కోసం స్థల సేకరణ పూర్తయిందని తెలిపారు. ఈనెల 12 నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వందశాతం యూనిఫారాలు అందజేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విష వాయువుల విడుదలతో ఆందోళన

జిన్నారం, జూన్ 9: బొల్లారం పారిశ్రామిక వాడలోని పలు రసాయన పరిశ్రమలు ప్రజారోగ్యాన్ని దెబ్బతీసేలా వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమలు యథేచ్ఛగా వాతావరణంలోకి ఫ్యాక్టరీ గొట్టాల ద్వారా విష వాయువులను విడుదల చేయడంపై స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. విష వాయువులను నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేస్తూ పర్యావరణంతో పాటు ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నారని మండిపడుతున్నారు. విడుదలైన వాయువులు ఘాటైన వాసనలతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోయారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు విష వాయువులతో దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారని, బాధ్యులైన పరిశ్రమలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమ నుంచి విడుదలవుతున్న విష వాయువులు

కొత్త వంగడాల అభివృద్ధికి ఇక్రిసాట్ కృషి

- ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్ను పాఠక్

కొత్త కంది వంగడం గురించి వివరిస్తున్న డైరెక్టర్ జనరల్ హిమాన్ను పాఠక్, శాస్త్రవేత్తలు

పటాన్‌చెరు రూరల్, జూన్ 9 : ఉష్ణదేశాలకు వాతావరణ మార్పులకు అనుగుణంగా, పెరుగుతున్న జనాభా విసురుతున్న సవాళ్లను అధిగమిస్తూ ఇక్రిసాట్ కొత్త వంగడాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్ను పాఠక్ తెలిపారు. సోమవారం పటాన్‌చెరులోని అంతర్జాతీయ ఉష్ణమండల పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిసాట్) ప్రధాన కార్యాలయం, పరిశోధన కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 125 రోజుల్లోనే కందిపంట రైతులకు చేతికి వచ్చేలా ఇక్రిసాట్ సంస్థ కొత్త వంగడాన్ని అభివృద్ధి చేసిందన్నారు. ఈ వంగడం మన దేశ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తల బృందం, పరిశోధకులు చేసిన కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రకాశ్ గంగిశెట్టి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డాక్టర్ స్టాన్‌ఫర్డ్ బ్లేడ్, డా విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల సత్వర పరిష్కారం

మాట్లాడుతున్న జహీరాబాద్ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

జహీరాబాద్, జూన్ 9 : రాజీ మార్గంతోనే కేసులు సత్వర పరిష్కారం అవుతాయని, తద్వారా డబ్బులు, సమయం కలిసి వస్తాయని జహీరాబాద్ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి అన్నారు. సోమవారం రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో జహీరాబాద్ మండల లీగల్ సర్వీసస్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్‌అదాలత్‌లో రాజీగల నేరాలు, గృహహింస, వరకట్నం తదితర కేసుల్లో రాజీ కుదర్చుకునేలా చొరవ చూపాలన్నారు. ఆ దిశగా స్టేషన్‌ల వారీగా కేసులను గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో బార్ ప్రసిడెంట్ గోపాల్, జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్, జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు శివలింగం, హనుమంతు, ఎస్ఐలు వినయ్‌కుమార్, రాజశేఖర్, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, నవీన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీ చైర్మన్ మృతి

దండే రామకృష్ణ (ఫైల్)

జిన్నారం, జూన్ 9: ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దండే రామకృష్ణ(76) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, నాయకులు, గ్రామస్తుల సమక్షంలో సోమవారం స్వగ్రామం కాజీపల్లిలో నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధిలో దండే రామకృష్ణ చేసిన కృషి ఎనలేనిదని, ఆయన మృతి జిల్లాకు తీరని లోటు అని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1986- 91 మధ్యకాలంలో టీడీపీ తరపున జడ్పీ చైర్మన్‌గా ఆయన పదవీ బాధ్యతలు నిర్వహించారు. మండల పరిషత్ వ్యవస్థ ఏర్పాటైన తర్వాత తొలి జడ్పీ చైర్మన్‌గా రామకృష్ణ ఎన్నికయ్యారు.

చిన్నపాటి వర్షానికి రోడ్లపై వరద

నారాయణఖేడ్, జూన్ 9: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో సోమవారం ఉదయం కురిసిన ఓ మోస్తరు వర్షానికి పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ వరదను తలపించాయి. రాజీవ్‌చౌక్, బసవేశ్వర చౌక్‌తో పాటు పలు వీధుల్లో నీరు పెద్ద ఎత్తున రోడ్లపై నుంచి ప్రవహించడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్ల పక్కన గల మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయని కారణంగా పూడిక నిండి వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. మున్సిపల్ సిబ్బంది వర్షం పడిన సందర్భాల్లో మాత్రమే పలుచోట్ల మురుగు కాల్వలను శుభ్రం చేయడం, అటు తర్వాత నెలల తరబడి వాటిలో నిండిన పూడికను తీయకపోవడం మూలంగానే ఇలాంటి సమస్య తలెత్తుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువైన కారణంగానే మున్సిపల్ నిర్వహణ తీరు పేలవంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నారాయణఖేడ్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద ఓ దుకాణ సముదాయం ముందు నిలిచిన వర్షపు నీరు

అర్జీలు పరిష్కరించాలి

అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 9: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలని అధికారులకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 61 అర్జీలు అందాయి. అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారని గత నెల 19న ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ చర్యలు తీసుకోలేదని మరోసారి సదరు వ్యక్తి ప్రజావాణిని ఆశ్రయించాడు. ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర అధికారులకు అర్జీని ఇస్తూ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నెంబరు 374లోని ప్రభుత్వ స్థలంలో కొంత మంది ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నారని, ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. ఎలాంటి ఇండ్లు లేకుండా ఇంటి నెంబరు పొంది అధికారులను తప్పుదోవ పట్టించి జీవో నెంబరు 59 ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సదరు విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

త్వరలో ఆసానికుంట శుద్ధీకరణ చర్యలు

జిన్నారం, జూన్ 9: బొల్లారం పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమల నుంచి విచ్చలవిడిగా వెలువడే వ్యర్థ జలాలతో పూర్తిగా కాలుష్యమయంగా మారిన ఆసానికుంట శుద్ధీకరణ పనులు త్వరలో చేపడతామని ఇరిగేషన్, పీసీబీ అధికారులు పేర్కొన్నారు. సోమవారం ఆసానికుంటను ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, పీసీబీ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ రవీందర్ కుమార్ సంయుక్తంగా పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరు శాఖల అధికారులు కుంటను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... రసాయన పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలు నేరుగా కుంటలోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్టీఎఫ్ ఏర్పాటుచేసి కుంటను రక్షిస్తామన్నారు. కుంట చుట్టూ మొక్కలు నాటి సుందరీకరణ పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల సిబ్బంది, ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందరావు, మెంబర్ సెక్రటరీ రాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

ఆసానికుంటను తనిఖీ చేస్తున్న ఇరిగేషన్, పీసీబీ అధికారులు

డబుల్ బెడ్‌రూం ఇండ్లను అప్పగించాలి

- జహీరాబాద్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా

జహీరాబాద్, జూన్ 9 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హోతికే గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని జహీరాబాద్ సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్‌లోని ప్రధాన రోడ్డుపై సీపీఎం ఆధ్వర్యంలో బైఠాయించారు. ఆనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు, లబ్ధిదారులు కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు లేక నిరుపేదలు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు పట్టా సర్టిఫికెట్లు అందజేసి ఏండ్లు గడుస్తున్నా నేటికి ఇండ్లను ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకుని లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించాలని, లేని పక్షంలో తామే లబ్ధిదారులతో కలిసి ఇండ్లను అక్రమించుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ దశరథ్ దృష్టికి సమస్య తీసుకెళ్లగా 20 రోజుల్లో పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఆందోళనలో సీపీఎం నాయకులు సలీమొద్దీన్, శ్రీకాంత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జహీరాబాద్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు